రోడ్డు దాటాలంటే నరకమే..



లింగంపల్లి చౌరస్తాలో ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న స్థానికులు

పెరిగిన వాహనాల రద్దీ

- ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు హామీలకే పరిమితం
- పట్టించుకోని అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై రోజురోజుకు రద్దీ పెరగడంతో బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమ యాల్లో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రోడ్డు దాటలంటే ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో రోడ్డు దాటుతూ అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

పెరుగుతున్న వాహనాల రద్దీ..

రామచంద్రాపురం పరిసరాల ప్రాంతాల్లో కొత్తకొత్త కాలనీలు ఏర్పడటంతో వాహనాల సంఖ్య పెరిగింది. జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రజలు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

మహిళలు, వృద్ధుల పరిస్థితి దారుణం

లింగంపల్లి చౌరస్తా, జ్యోతినగర్, అశోక్‌నగర్, బీరంగూడ, రామచంద్రాపురం జాతీయరహదారిని దాటలంటే స్థానికులు నరకయాతన పడుతున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు పరిస్థితి దారుణంగా ఉంది.

సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసినా..

నిత్యం రద్దీ ఎక్కువగా ఉండే అశోక్‌నగర్, బీరంగూడ, రామచంద్రాపురంలో బాటసారులు రోడ్డు దాటేందుకు పోలీసులు సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. కనీసం సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులు వాహనాలను ఆపడంలేదు. సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసిన ప్రయోజనం లేకుండా పోయింది.

కలగానే ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు..

రోడ్డు దాటుతూ అనేక మంది ప్రమాదాలకు గురి కావడంతో గత 10ఏళ్ల క్రితం స్థానిక ప్రజాప్రతినిధులు లింగంపల్లి చౌరస్తా, అశోక్‌నగర్, బీరంగూడ, రామచంద్రాపురంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు కోసం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వాటి ఎక్కడ ఏర్పాటు చేయాలో వివిధ శాఖ అధికారులతో కలసి చర్చలు సైతం నిర్వహించారు. కానీ నేటికి నేతల ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు హామీ అమలుకు నోచుకోవడంలేదు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



బాటసారులు రోడ్డు దాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అశోక్‌నగర్, బీరంగూడ చౌరస్తా వద్ద బాటసారులు రోడ్డు దాటేందుకు సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశాం. ప్రజలు రోడ్డు దాటే సమయంలో వాహనాలను నిలపకపోతే వారిపై చర్యలు తప్పవు. త్వరలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వచ్చే అవకాశం ఉంది.

– విద్యాసాగర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం

కులగణన చారిత్రాత్మక నిర్ణయం

బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అంజిరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జనగణనతో పాటు కులగణన చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ గురువారం మండలంలోని నిజాంపూర్ గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే ఈ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఏ కులానికి నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్ల అమలులో న్యాయం జరుగుతుందన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ విజయమంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కులగణనకు వ్యతిరేకి అని, ఆ పార్టీ ఏనాడూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే తప్పుల తడకని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆదిత్య, మాణిక్ రావు, కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన సదాశివుడి రథోత్సవాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని కొల్కూర్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న సదాశివుడి రథోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు ఎడ్లబండ్ల, రథం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని స్థానిక పీఏసీఎస్‌లో గురువారం కొనుగోలు కేంద్రాన్ని జహీరాబాద్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామితో కలసి ప్రారంభించారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించిదాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. జొన్నలు క్వింటాలు ధర రూ.3371 కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రప్ప, మాజీ వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, నాయకులు రఫీయోద్దీన్, శాంత్‌కుమార్ పాటిల్, గురుపుత్ర, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం బోక్కస్‌గాంలో ఏడీఏ నూతన్‌కుమార్ గురువారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీఏసీఎస్ సీఈఓ సతీష్, రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రం నిర్వహణ గురించి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

అంటరానితనం మహాపాపం



సమరత అభియాన్ రథయాత్రకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పీఠాధిపతి విశ్వాత్మనందగిరి స్వామి, శంకరస్వామి

న్యాల్‌కల్(జహీరాబాద్): అంటరానితనం మహాపాపమని దానిని రూపు మాపేందుకు అందరూ కృషి చేయాలని దామరచేడు, భద్రాచలం పీఠాధిపతులు విశ్వాత్మనందగిరి స్వామి, శంకరస్వామి పిలుపునిచ్చారు. అందరు కలసి మెలసి ఉండాలని ఉద్దేశంతో విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సమరత అభియాన్ రథయాత్ర గురువారం న్యాల్‌కల్‌కు చేరుకొంది. రథయాత్రకు విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హిందూ సంఘాలు ఘనంగా స్వాగతం పలికాయి. గ్రామపుర వీధుల గుండా కొనసాగిన రథయాత్ర స్థానిక రామలింగేశ్వర మందిరం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ ..అంటరాని తనం రూపు మాపేందుకు చేపట్టిన ఈ రథయాత్రకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు ధనంజయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్ చేరుకున్న రథయాత్ర

జహీరాబాద్: హిందూ సమాజంలోని అన్ని కులాలు, వర్గాలు, జాతులను కలుపుకొని పోవడమే హైందవ గొప్పతనమని విశ్వ హిందూ పరిషత్ అఖిల భారత సహకార్యదర్శి దేవ్‌జీ రావత్ అన్నారు. గురువారం రాత్రి విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సమరసత రథయాత్ర జహీరాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల పంచముఖ హనుమాన్ మందిరం నుంచి మార్కండేశ్వర ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవ్‌జీ రావత్ మాట్లాడుతూ.. భాషలు, ప్రాంతాల వారు కలిసి మెలిసి ఆనందంగా జీవించడమే సమరసతగా పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్ చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం బుధవారం నిర్వహించిన తనిఖీలో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఇద్దరికీ రూ.1500 చొప్పున, నలుగురికి రూ.వెయ్యి చొప్పున, ముగ్గురికి రూ.2 వేలు చొప్పున, ఇద్దరికి రూ. 500 చొప్పున జరిమానా విధించారు. అలాగే మరో వ్యక్తి జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

గీతం విద్యార్థి సంతోష్ కుమార్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, పటాన్‌చెరు మండలం రుద్రారంలోని ఈఈసీఈ విభాగం పరిశోధక విద్యార్థి సంతోష్ కుమార్ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'వైర్ లెస్ సెన్సార్ నెట్‌వర్క్ జీవితకాల మెరుగుదల కోసం సింక్ రీపొజిషనింగ్ టెక్నిక్‌ని ఉపయోగించి తప్పు నోడ్‌ల గుర్తింపు'పై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఈఈసీఈ ప్రొఫెసర్ త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్ఎస్-2 ఉపయోగించి అనుకరించిన ఈ ఫలితాలు, పర్యావరణ పర్యవేక్షణ, విపత్తు ప్రతిస్పందన, ఆరోగ్య సంరక్షణ, నిఘా, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)లో అనువర్తనాలతో ప్యాకెట్ డెలివరీ, తప్పు–సహనం, నెట్ వర్క్ జీవితకాలంలో గణనీయమైన మెరుగుదలను ప్రదర్శిస్తాయని తెలియజేశారు. పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడంపై గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రామిక భవన్ ముందు జెండాను ఆవిష్కరించిన అనంతరం బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం జరిగిన బహిరంగ సభలో మల్లికార్జున్ మాట్లాడుతూ...కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై కార్మికులు తిరగబడాలన్నారు. లేకపోతే కార్మికులకు హక్కులు రక్షణ చట్టాలు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను ఎప్పుడు తెచ్చినా నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య,సీఐటీయూ నాయకులు పాండురంగారెడ్డి, వాజిద్ అలీ, మల్లేశం, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జోగిపేట(అందోల్): అందోల్ తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మున్సిపాల్ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ప్రేమ్‌కుమార్, ఎం.మనోహర్ ప్రసాద్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరవలేవని కొనియాడారు. కార్మికులు లేదనిదే ప్రజారోగ్యం లేదని, వారికి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అందోల్ జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, మండల కార్యవర్గ సభ్యులు శంకరప్ప, వెంకటేశం టి రాజయ్య, కె సదాశివగౌడ్, సీనియర్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

తహసీల్దార్ వెంకటస్వామి



నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీ

పటాన్‌చెరు: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ సర్వే నంబర్ 993లో ప్రభుత్వ భూమిలో మూడు అక్రమ నిర్మాణాలు, మరో రెండు బేస్మెంట్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను జేసీబీతో కూల్చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న రాకేష్ షెట్కార్

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలకు విలువ గల చెక్కులు మంజూరయ్యాయి. గురువారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ఖేడ్‌లోని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ స్వగృహంలో బాధితులకు చెక్కులను అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు మధు, గంగారెడ్డి, సత్యం, రవీందర్, సోఫీ, రహెమాన్, విజయ్, మారుతి పాల్గొన్నారు.

ఉగ్రదాడులను నిరసిస్తూ శాంతి ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

సంగారెడ్డి జోన్: టూరిస్టులపై జరిగిన ఉగ్రవాది దాడులను నిరసిస్తూ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మధుసూదనాచారి, కోశాధికారి దయానంద్‌చారి, విశ్వకర్మ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదే మృతి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుత్ షాక్‌తో గేదే మృతి చెందిన సంఘటన కల్హేర్ మండలంలోని బీబీపేట్‌లో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇసాక్‌కు చెందిన పాడి గేదే గ్రామ సమీపంలో మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరుకు తగిలింది. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రూ.50 వేల విలువైన గేదే మృతి చెందిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని వేడుకున్నాడు.



జోగిపేట చౌరస్తా వద్ద..

ఐక్యతకు నిదర్శనం మేడే

మేడేను పురస్కరించుకొని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వాడవాడలా ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు కేంద్రం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. శ్రామికులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధివిధానాలు తిప్పికొట్టాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాటమే మేడే లక్ష్యమన్నారు.



బుదేరాలో జెండావిష్కరిస్తున్న సీఐటీయు నాయకులు



హత్నూర : నస్తీపూర్ శివారులోని పరిశ్రమ వద్ద



కంది: జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



నారాయణఖేడ్ ఆస్పత్రి ఆవరణలో జెండా విష్కరణ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



జిన్నారం (పటాన్‌చెరు): మేడే వేడుకల్లో పాల్గొన్న వరప్రసాద్‌రెడ్డి



సదాశివపేట పట్టణంలోని సివిల్‌సప్లయ్ గోదాం వద్ద



క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న బెల్ అధికారులు



తెల్లాపూర్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్ భరత్

కులగణన కాంగ్రెస్ విజయమే

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



రేవంత్‌రెడ్డికి పూలబొకే అందజేస్తున్న నీలం మధు, మంత్రి పొన్నం

పటాన్‌చెరు టౌన్: దేశవ్యాప్తంగా జరిగే జనగణనతో పాటు కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ విజయమని పార్టీ నేత నీలం మధు అన్నారు. తెలంగాణలో కులగణనను చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచి దేశవ్యాప్తంగా కులగణనకు బాటలు వేసినందుకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని జుబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలని సదుద్దేశంతో రాహుల్ గాంధీ సూచనల మేరకు సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో కులగణన చేపట్టారని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేసి దేశానికి దిశానిర్దేశం చేస్తూ దారి చూపాడని కొనియాడారు. రేవంత్ రెడ్డి చొరవతోనే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన కోసం నిర్ణయం తీసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల తరఫున సీఎం రేవంత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా బసవేశ్వర విగ్రహ శోభాయాత్ర



శోభాయాత్రలో డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, శంకర్‌పాటిల్

సదాశివపేట(సంగారెడ్డి): మహాత్మా బసవేశ్వర జయంతి సందర్భంగా పట్టణంలోని వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో బసవేశ్వర ఉత్సవ విగ్రహ శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. బసవేశ్వర మందిరం నుంచి తిలక్ రోడ్డు, సివిల్‌క్లబ్ ఎడ్లబజార్ గల్లీల గుండా శోభాయాత్ర సాగింది. శోభాయాత్రలో వీరశైవ యువకులు విన్యాసాలు, మహిళల కోలాటాల మధ్య శోభాయాత్ర అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ పాటిల్, మాజీ కౌన్సిలర్ అన్మిశెట్టిమల్లేశం, ఆకుల శివకుమార్, వైశ్యయువజన సంఘం పట్టణ అధ్యక్షుడు నాగేష్, వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు గంధిగరాజు, ప్రధాన కార్యదర్శి వినోద్, సమాజం సభ్యులు రాచన్న, వీరమహేందర్, రాచప్ప, రమేష్, రవి, సురేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నందిగోల

మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దలోడి గ్రామంలోని బసవేశ్వర దేవాయలంలో ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో నందిగోల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పుర విధుల గుండా తిరుగుతూ దండకాలు వేశారు. కార్యక్రమంలో బస్వరాజ్‌పాటిల్, విజయ్‌కుమార్, అశోక్, వెంకటేశం ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



పెద్దలోడిలో దండకాలు వేస్తున్న భక్తులు

లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో..

జహీరాబాద్ టౌన్: మహాత్మా బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంలో అర్ధరాత్రి వరకు శోభాయాత్ర కొనసాగింది. రాష్ట్రీయ బసవదళ్, లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా శోభాయాత్రలు నిర్వహించారు. కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్, డీఎస్పీరాంమోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, ఎస్ఐ.కాశీనాథ్, రాష్ట్రీయ బసవ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ లింగాయత్ సమాజ్ నాయకులు పాల్గొన్నారు.